


గురుకుల విద్యార్థులతో మాట్లాడతున్న కలెక్టర్ మను చౌదరి

ప్రభుత్వ భూములను కాపాడాలి

» పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి
» మేడ్చల్ కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి

మేడ్చల్, జూలై 4(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని ప్రభుత్వ భూములను కబ్జాకు గురికాకుండా కాపాడాలని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో భూ భారతి, రేషన్‌కార్డులు, ఎల్ఆర్ఎస్ తదితర అంశాలపై అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్‌రెడ్డిలతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి, రేషన్ కార్డులు, ఎల్ఆర్ఎస్ పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. అవసరమైన చోట మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్ఆర్ఎస్ చెల్లించిన వారికి ప్రొసీడింగ్స్ అందించాలన్నారు. సమావేశంలో డీఆర్వో హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రవతి, ఆర్డీవోలు ఉపేందర్‌రెడ్డి, శ్యాంప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

మేడ్చల్ టౌన్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ మను చౌదరి సూచించారు. మేడ్చల్ మున్సిపల్ కిష్టాపూర్ గురుకుల బాలికల పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వంట గది నిర్వహణ, సామగ్రి నాణ్యతను పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలన్నారు. వసతి గృహంలో అందిస్తున్న భోజనం, ఇతర వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ లలిత, జోనల్ అధికారి రజితలు పాఠశాలలో మైనర్ రిపేర్ల కోసం నిధులు కావాలని కోరారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదన పంపాలని కలెక్టర్ సూచించారు.

భారీ కొండచిలువ కలకలం



కులకచర్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాపల గూడెంలో కొండ చిలువ కలకలం రేపింది. గ్రామానికి చెందిన రైతు గోవర్దన్ శుక్రవారం ఉదయం పొలానికి వెళ్లగా కొండచిలువ కనిపించింది. వెంటనే స్నేక్ క్యాచర్ అజామ్‌కు సమాచారం అందించాడు. అక్కడికి చేరుకున్న అతడు కొండచిలువను పట్టుకొని తీసుకెళ్లాడు. దాన్ని ఫారెస్టు అధికారులకు అప్పగిస్తానన్నారు. ఇళ్లలో, పొలాల్లో పాములు కనిపిస్తే వాటిని చంపకుండా తన (6301567044)కు సమాచారం ఇవ్వాలని సూచించారు.


చేవెళ్ల మండలం మల్కాపూర్ వద్ద ప్రమాదకరంగా రోడ్డు మలుపు


చేవెళ్ల మండలం ఆలూరు గేట్ వద్ద ప్రమాదం (ఫైల్)

ఆగుతూ.. సాగుతూ

ముందుకు కదలని 163 హైవే పనులు

ఎన్‌హెచ్ 163 (బీజాపూర్ హైవే) విస్తరణకు అడుగడుగునా అవాంతరాలే. పనులు ఆగుతూ.. సాగుతుండటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. గుంతలు, మూలమలుపులతో ఆ రోడ్డుపై ప్రయాణించాలంటేనే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. నాలుగేళ్లలో 715 ప్రమాదాలు జరగ్గా 181 మంది మృతి చెందారు. 707 మంది క్షతగాత్రులయ్యారు. మర్రి చెట్ల రక్షణ నేపథ్యంలో గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుతో పనులు నిలిచిన విషయం తెలిసిందే. కాగా, మర్రి చెట్ల కారణంగా హైవే పనులు నిలిచిపోగా మొయినాబాద్, చేవెళ్ల ప్రాంతాల్లో బైపాస్ పనులు మాత్రం కొనసాగుతున్నాయి.

ప్రాజెక్టు వివరాలు

అప్పా జంక్షన్- మన్నెగూడ: 46 కి.మీ
ప్రాజెక్టు వ్యయం: రూ.956 కోట్లు
అండర్ పాస్‌లు : 18
బైపాస్‌లు : 02
భూసేకరణ వ్యయం : రూ.156.80 కోట్లు
సేకరించాల్సిన భూమి : 266.55 హెక్టార్లు

గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పుతో బ్రేక్

- మృత్యు మలుపులు, డేంజర్ స్పాట్లు
- నిత్యం జరుగుతున్న ప్రమాదాలు
- నెత్తురోడుతున్న బీజాపూర్ రహదారి
- 4 ఏళ్లలో 715 ప్రమాదాలు, 181 మరణాలు
- పనులకు శంకుస్థాపన చేసి 29 నెలలు పూర్తి
- పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు


చేవెళ్ల బైపాస్ మధ్యలో నిర్మిస్తున్న అండర్‌పాస్

రోడ్డు ప్రమాదాల వివరాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2021	240	46	239
2022	129	33	136
2023	110	58	105
2024	147	37	140
2025(మే)	89	07	87
మొత్తం	715	181	707

రంగారెడ్డి అర్బన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): అప్పా జంక్షన్ వయా చేవెళ్ల మన్నెగూడ వరకు జాతీయ రహదారి 163 విస్తరణ పనులకు బ్రేక్ పడింది. చెట్లను తొలగించవద్దని గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) తీర్పు వెల్లడించిన విషయం విదితమే. 900కు పైగా మర్రిచెట్ల సంరక్షణకు సంబంధించి ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్(ఈఐఏ) నివేదికలో లోపాలు, ప్రజాభిప్రాయ సేకరణ లేకపోవడం, ప్రత్యామ్నాయ మార్గాలపై అధ్యయనం చేయకపోవడం వంటి అంశాలపై ట్రిబ్యునల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జెడ్ఎస్ఐ) నివేదిక లేకుండా ఎక్స్‌పర్ట్ అప్రైసల్ కమిటీ(ఈఏసీ) ఈఐఏను ఆమోదించడాన్ని కూడా తప్పుపట్టింది. సమగ్రంగా అధ్యయనం చేసి రిపోర్టులు సమర్పించే వరకు పనులు నిలిపివేయాలని ఆదేశించింది. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

ఈఐఏ నివేదికలో లోపాలివే..

900 మర్రి చెట్లలో 522 చెట్లను తరలిస్తామని, బైపాస్‌లు, రోడ్డు వెడల్పు తగ్గించడం ద్వారా 393 చెట్లను కాపాడతామని ఎన్‌హెచ్ఏఐ వివరించింది. అయినా కేవలం

మిగతా 7వ పేజీలో...

డేంజర్ స్పాట్స్ ఇవే..

అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు రోడ్డుపై మొత్తం 66 మలుపులు ఉన్నాయి. అందులో 19 డేంజర్ స్పాట్స్ ఉన్నాయి. మొయినాబాద్ మండలం రాణి ఇంజన్‌వాల్, ఎనికేపల్లి చౌరస్తా, హిమాయత్‌నగర్ చౌరస్తా, పాత అజీజ్ నగర్ గేట్, కనకమామిడి, గ్రీన్‌ఫీల్డ్, తోలకట్టా, చేవెళ్ల మండలంలోని కందవాడ, మల్కాపూర్, కేసారం సమీపంలోని రోడ్డు మలుపులు అత్యంత ప్రమాదకరంగా మారాయి. అలాగే షాబాద్ చౌరస్తా, శంకర్‌పల్లి చౌరస్తా, ఇబ్రహీంపల్లిగేడ్-మోడల్ కాలనీ, దామరగిద్ద గేట్, బస్తేపూర్, మీర్జాగూడ, ఖానాపూర్, ఆలూరు, అంతారం, కండ్లపల్లి గేట్ సమీపంలోమలుపులు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి.

ఇదే దారిలో.. సీఎం, స్పీకర్ ప్రయాణం

ఈ హైవేపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. నగరానికి చేరువుగా ఉండటంతో వ్యవసాయ క్షేత్రాలు, ఫామ్ హౌస్‌లు, అనంతగిరి, కోట్‌పల్లి ప్రాజెక్టులను వీక్షించేందుకు వీకెండ్‌లో పర్యాటకులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు చిన్నదిగా ఉండటంతో తరచూ ట్రాఫిక్ జాం ఏర్పడటంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏటా 50 - 60 మంది మృతి చెందుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వారి నియోజకవర్గాలకు ఇదే దారిలో వెళ్తుంటారు.

రోడ్డు విస్తరణపై స్పష్టత ఇవ్వాలి

ఎన్‌హెచ్ 163 రోడ్డు విస్తరణ పనులపై ఆర్అండ్‌బీ మంత్రి, స్థానిక ఎంపీ స్పష్టత ఇవ్వాలి. ఆలూరు వద్ద రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందిన ఘటన సమయంలో చేవెళ్ల ఎంపీ, ఎమ్మెల్యే స్పందించి రోడ్డు పనులను ఇక ఆగవని చెప్పారు. అనంతరం కోర్టు తీర్పుతో మళ్లీ ఆగాయి. ఈ రోడ్డును వదిలేసి పక్కనుంచి మరో రోడ్డును నిర్మించాలి. ఇరుకు రోడ్డుతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. కొత్త రోడ్డు నిర్మించి ప్రమాదాలను నివారించాలి. ఎవరూ పట్టించుకోకుంటే.. ఆందోళన చేపడతాం.



-పట్లోళ్ల కృష్ణారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్

మాకో మంత్రి పదవి ఇవ్వండి

ఏఐసీసీ అధ్యక్షుడికి ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేల వినతి ● పార్టీ అంతర్గత సమస్యలపై ప్రస్తావన



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

రాష్ట్ర మంత్రివర్గంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి ఒక్కరికైనా స్థానం కల్పించాలని స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు విన్నవించుకున్నారు. రెండు రోజుల హైదరాబాద్ పర్యటనకు విచ్చేసిన ఖర్గేను ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు నేతలు, ఎమ్మెల్యేలు వేర్వేరుగా కలిశారు. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో తమకు అవకాశం దక్కకపోవడంతో అసంతృప్తిగా ఉన్న ఎమ్మెల్యేలు ఖర్గేను కలిసి ఉమ్మడి జిల్లాకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించాలని మరోసారి కోరారు. మంత్రివర్గంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు కూడా ప్రాతినిధ్యం కల్పించాలని ఎమ్మెల్యేలు గత కొంతకాలంగా ముక్తకంఠంతో కోరుతున్న విషయం విదితమే. మంత్రివర్గంలో స్థానం కోసం గతంలో వేరు వేరుగా ప్రయత్నించిన ఎమ్మెల్యేలు చివరకు ఒక్కతాటిపైకి వచ్చి తమలో ఎవరికి అవకాశం కల్పించినా అభ్యంతరం లేదని పలుమార్లు పార్టీ పెద్దలను కలిసి తమ మనోగతాన్ని వెల్లడించారు. ఎమ్మెల్యేలు మల్‌రెడ్డిరంగారెడ్డి, టి. రామ్మోహన్‌రెడ్డి, బి. మనోహర్‌రెడ్డి, యాదయ్య పలుమార్లు ఢిల్లీ వెళ్లి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌ను కలిసి లేఖలు కూడా అంద చేశారు. అంతేకాక వీరికి మద్దతుగా పార్టీ సీనియర్ నేత జానారెడ్డి మంత్రివర్గ విస్తరణలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ ఏఐసీసీకి లేఖ రాశారు. దీంతో మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి జిల్లా నుంచి ఒక్కరికైనా అవకాశం లభిస్తుందని అంతా భావించారు. అయితే ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి జిల్లా నుంచి ఒక్కరికీ అవకాశం దక్కలేదు. దీంతో అసంతృప్తిగా ఉన్న సీనియర్ ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి నగరానికి వచ్చిన ఖర్గేను వేరువేరుగా కలిసి వచ్చే మంత్రివర్గ విస్తరణలో స్థానం కల్పించాలని కోరారు. తమకు ఉన్న అర్హతలను ఆయనకు వివరించారు. తమలో ఎవరికి అవకాశం ఇచ్చిన అభ్యంతరం లేదన్నారు. గతంలో పాత ఉమ్మడి రంగారెడ్డిజిల్లా నుంచి ఇద్దరికి మంత్రివర్గంలో ప్రాధాన్యత ఉండేదని వివరించారు. ఇప్పుడు ఉమ్మడి జిల్లా నుంచి ఒక్కరు కూడా మంత్రిగా లేకపోవడంతో పరోక్షంగా పార్టీకి కూడా నష్టం జరుగుతుందని తెలిపారు.

ప్రతిపక్షాల నుంచి సవాళ్లు

ఇప్పటికే క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగం ప్రతిపక్షాల నుంచి అనేక సవాళ్లు ఎదుర్కొంటోందంటూ కొన్ని ఇబ్బందులను ఆయనకు వివరించారు. వచ్చేస్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఉమ్మడి జిల్లాలో ఒకరికైనా మంత్రివర్గంలో అవకాశం కల్పించాలని వారు కోరారు. లేకుంటే స్థానిక ఎన్నికల ఫలితాలపై ప్రభావంపడే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇదిలా ఉంటే క్షేత్రస్థాయిలో పార్టీ అంతర్గత సమస్యలపైనా ఎమ్మెల్యేలతో పాటు స్థానిక నేతలు ఖర్గే వద్ద ప్రస్తావించినట్లు తెలిసింది.


పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డీజీపీ జితేందర్, పక్కన కలెక్టర్ ప్రతీక్‌జైన్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి

డ్రగ్స్ కట్టడికి పకడ్బందీ చర్యలు

» తెలంగాణ డీజీపీ జితేందర్

కొడంగల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల కట్టడికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలంగాణ డీజీపీ జితేందర్ తెలిపారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో రూ.10 కోట్ల వ్యయంతో కొడంగల్ సర్కిల్, పోలీస్‌స్టేషన్, దుద్యాల, బొంరాస్‌పేట్ మండల కేంద్రాల్లో నూతన పోలీస్‌స్టేషన్‌ల నిర్మాణానికి పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం డీజీపీ విలేకరులతో మాట్లాడుతూ యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావద్దన్నారు. ప్రజల సౌకర్యార్థం ఆధునాతన సౌకర్యాలతో పోలీస్‌స్టేషన్‌ల భవనాలను నిర్మించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయని వివరించారు. అంతకు ముందు డీజీపీ జితేందర్, పోలీస్ ఉన్నతాధికారులను కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీజీపీ జితేందర్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.కార్యక్రమంలో పోలీస్ ఉన్నతాధికారులు ఎమ్‌డీ రమేశ్, మల్టీజోన్-2 ఇన్‌చార్జి ఐజీపీ తఫ్సీర్ ఇక్బాల్, ఎస్పీ నారాయణరెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించాలి

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్/కొడంగల్/పరిగి, జూలై 4(ఆంధ్రజ్యోతి): మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ లబ్ధిదారులకు సూచించారు. శుక్రవారం వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో బుడగజంగం కాలనీలో మంజూరైన 13 ఇళ్ల నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరిలతో కలిసి పరిశీలించారు. ఇల్లు మంజూరైన ప్రతి ఒక్కరూ నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట మునిసిపల్ కమిషనర్ జాకీర్ అహమ్మద్, తదితరులు ఉన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ఆలయ అభివృద్ధిలో ఇళ్లు కోల్పోతున్న వారికి స్థలాలు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. కొడంగల్ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా శుక్రవారం నిర్వాసిత కుటుంబాలకు కేటాయించే స్థలాన్ని ఆయన పరిశీలించారు. కలెక్టర్ వెంట తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్ ఉన్నారు.


లబ్ధిదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

పరిగి తహసీల్దార్ కార్యాలయ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. నిర్మాణ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేస్తున్న కార్యాలయ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనులు నాణ్యతగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.ఆనంద్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

» జిల్లా వైద్యాధికారి లలితాదేవి

బొంరాస్‌పేట్/కొడంగల్ రూరల్/దుద్యాల/దౌల్తాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి లలితాదేవి డాక్టర్లు, సిబ్బందికి సూచించారు. ఆమె శుక్రవారం బొంరాస్‌పేట్, కొడంగల్ మండలంలోని అంగడిరైచూర్, దుద్యాల మండలంలోని హకీంపేట్, దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల్లోని రికార్డులను తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. దౌల్తాబాద్ ఆసుపత్రిలో సిబ్బంది తక్కువగా ఉన్నారని తెలపడంతో ఉన్నతాధికారులతో మాట్లాడి నియమిస్తామని తెలిపారు.ఆమె వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీందర్‌యాదవ్, వైద్యాధికారి హేమంత్, డాక్టర్ వందన, ప్రవీణ్‌కుమార్, అమూల్య ప్రియదర్శిని, సిబ్బంది రఫీక్ ఉన్నారు.


అంగడిరైచూర్‌లో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో లలితాదేవి

మాజీ సీఎం రోశయ్యకు ఘన నివాళి

మేడ్చల్, జూలై 4(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం రోశయ్య జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం డీఆర్వో హరిప్రియ, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొమురయ్య సేవలు మరువలేనివి

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొమురయ్య గొప్పదనాన్ని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు ఝాన్సీ రాణి, వినోద్, రాంమోహన్, కురుమ సంఘం నాయకులు సురేష్, తదితరులు పాల్గొన్నారు.


రోశయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

కాంగ్రెస్ సభకు బస్సులు.. ప్రయాణికుల తిప్పలు

- డిపోల నుంచి సగానికి పైగా బస్సుల తరలింపు
- గంటల తరబడి ప్రయాణికుల ఎదురు చూపులు
- ఆర్టీసీ అధికారుల తీరుపై మండిపాటు

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

షాద్‌నగర్ అర్బన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఈనెల 9న నిర్వహించబోతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బంది వేతనాలను పెంచాలని, ఖాళీలను భర్తీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న కూలీల వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ సభకు బస్సులు.. ప్రయాణికుల తిప్పలు

- డిపోల నుంచి సగానికి పైగా తరలింపు
- గంటల తరబడి ఎదురు చూపులు
- ఆర్టీసీ అధికారుల తీరుపై మండిపాటు


శుక్రవారం రాత్రి 7.30 గంటలకు వికారాబాద్ బస్ స్టేషన్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

వికారాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/వికారాబాద్ : హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో శుక్రవారం జరిగిన సామాజిక న్యాయ సమరభేరి బహిరంగ సభకు సగానికి పైగా ఆర్టీసీ బస్సులు తరలి వెళ్లడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బస్సుల కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సి వచ్చింది. వికారాబాద్ డిపో నుంచి 40 బస్సులు, తాండూరు డిపో నుంచి 40, పరిగి డిపో నుంచి 30 బస్సులు బహిరంగ సభకు వెళ్లడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులకు ఇక్కట్లు తప్పలేదు. జిల్లాలో నడిచిన డీలక్స్ బస్సులు సైతం రద్దీగా నడిచాయి. వికారాబాద్ డిపో పరిధిలో శంకర్‌పల్లి, సదాశివపేట్, నస్కల్ పరిగి, హైదరాబాద్, తాండూరు మార్గాల్లో ప్రయాణికులు ఎక్కువగా రాకపోకలు కొనసాగిస్తుంటారు. కాగా, శుక్రవారం పల్లె వెలుగు బస్సులు తక్కువ సంఖ్యలో నడవడంతో గంటల తరబడి ఎదురు చూపులు తప్పలేదు. శంకర్‌పల్లి నుంచి వికారాబాద్ రావడానికి... వికారాబాద్ నుంచి శంకర్‌పల్లి వెళ్లడానికి రెండు గంటల కంటే ఎక్కువ సమయం వేచి చూడాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. రోజూ 34 ట్రిప్పులు నడిచే రూట్లలో కేవలం 8 నుంచి 12 ట్రిప్పులు మాత్రమే నడిపించినట్లు తెలుస్తోంది. వికారాబాద్ నుంచి పరిగి వెళ్లడానికి ఆఖరు బస్సు రాత్రి 8 గంటలకు ఉండగా, రెండున్నర గంటలు ముందుగానే ఈ మార్గంలో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. వికారాబాద్ ఆర్టీసీ బస్ స్టేషన్‌లో రాత్రి 7.30 గంటలకు వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు 150 మంది వరకు బస్సుల కోసం ఎదురు చూస్తూ ఉండడం కనిపించింది. ఇదే పరిస్థితిని తాండూరు, పరిగి డిపోల పరిధిలో ప్రధాన మార్గాల్లో వెళ్లాల్సిన ప్రయాణికులు ఎదుర్కొన్నారు. బస్సులు అందుబాటులో లేకపోవడంతో బస్ స్టేషన్లలో ఉండే కంట్రోలర్లు ప్రయాణికులకు సరైన సమాధానం చెప్పలేక ఇబ్బందులు పడ్డారు.

ముందస్తు సమాచారమేదీ?

శుక్రవారం హైదరాబాద్‌లో బహిరంగ సభకు ఆర్టీసీ బస్సులు ఎక్కువ సంఖ్యలో వెళుతున్న విషయం గురించి ఆర్టీసీ అధికారులు ముందస్తు సమాచారం ఇచ్చి ఉంటే తాము తమ ప్రయాణాన్ని కొనసాగించాలా లేక వాయిదా వేసుకోవాలా అనే విషయమై ఆలోచన చేసి ఉండేవారమని పలువురు ప్రయాణికులు అభిప్రాయపడ్డారు. సభ కోసం ముందుగానే బస్సులు బుక్ చేసినప్పుడు శుక్రవారం ఏయే మార్గాల్లో బస్సులు తక్కువగా ఉండే అవకాశం ఉందన్న విషయాన్ని ప్రసార, సామాజిక మాధ్యమాల ద్వారా తెలియజేసి ఉంటే గంటల తరబడి ఎదురు చూపులుతప్పేవని వారన్నారు.

రెండు గంటలైనా బస్సు రాలేదు..



నేను ధారూరు వెళ్లడానికి తాండూరు వెళ్లే బస్సుల కోసం రెండు గంటలు ఎదురు చూసినా రాలేదు. వచ్చిన డీలక్స్ బస్సులో వెళ్లాలని ప్రయత్నించినా దాంట్లో కాలు మోపేందుకు కూడా సందు లేదు. బస్సులన్నీ సభకు పంపిస్తే మాలాంటి వారు ఎలా గ్రామాలకు చేరుకోవాలో ఆర్టీసీ అధికారులు చెప్పాలి.

-నీలమ్మ, గృహిణి, ధారూరు

వచ్చి ఇబ్బందులు పడ్డా...



శంకర్‌పల్లి రూట్లో వెళ్లే బస్సులు సరిగా నడవక ఆ వైపు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రెండు గంటలు ఎదురు చూసినా బస్సు రాలేదు. ఎప్పటి మాదిరిగానే శుక్రవారం ఎక్కువగా బస్సులు నడవవనేది నాకు తెలియదు. వచ్చి ఇబ్బందులు పడాల్సి వచ్చింది

- ఎల్లయ్య, చిట్టిగిద్ద, నవాబ్‌పేట్ మండలం


బీఎల్‌వోల శిక్షణలో అదనపు కలెక్టర్ సుధీర్

ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలి

మోమిన్‌పేట్, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. శుక్రవారం మోమిన్‌పేట్ మండల కేంద్రంలో బీఎల్‌వోలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో విజయలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఆర్ఐలు గోవర్ధన్, సరిత, మహేశ్, అలవేలు, సునీత, మౌనిక, రాఘవేందర్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల బాధ్యత కార్యదర్శులదే..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. మోమిన్‌పేట్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీవో యాదగిరి, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునే విధంగా పంచాయతీ కార్యదర్శులు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో నర్సింహులు, మాధవి, సుగుణ, స్వప్న, రాణి, ప్రవీణ్‌కుమార్, జగన్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రాంచందర్, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రాజ్, నర్సింహులు, ఇందిర పాల్గొన్నారు.

త్వరితగతిన పూర్తి చేయాలి

శంకర్‌పల్లి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్ సూచించారు. శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇళ్లను నిర్మించుకోవాలని వివరించారు. వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సురేష్ బాబు, పంచాయతీ అధికారి గిరిరాజ్, ఎంఈవో అక్బర్, ఏపీవో నాగభూషణం తదితరులు ఉన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

మోమిన్‌పేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని మొరంగపల్లి అంబేడ్కర్ చౌరస్తాలో భద్రతను పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం అన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ వెంకట్, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ఎస్సై అరవింద్, ఏఎస్సై శ్రీనివాస్‌గౌడ్, మానయ్య పాల్గొన్నారు.

చదువుతో పాటు పరిశోధనలు ముఖ్యం

మొయినాబాద్ రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు సమాజానికి ఉపయోపడే పరిశోధనలు ముఖ్యమని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ డైరెక్టర్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాత్వికరెడ్డి అన్నారు. హిమాయత్‌నగర్‌లోని యూనివర్సిటీకి చెందిన ప్రణీత్.. డయాబెటిక్ రెటినోపతి డిటెక్షన్ అండ్ క్లాసిఫికేషన్ యూజింగ్ మెషీన్ లెర్నింగ్ అండ్ డీప్ లెర్నింగ్ టెక్నిక్స్ అనే అంశంపై డాక్టర్ అరవింద్ పర్యవేక్షణలో పరిశోధన చేయగా పీహెచ్‌డీ అందుకున్నారు. ప్రణీత్‌కుసాత్వికరెడ్డి పట్టాను శుక్రవారం యూనివర్సిటీలో ప్రదానం చేశారు. రవీందర్, డీన్ ఆచార్య క్రిష్టోఫర్ పాల్గొన్నారు.

సాంకేతిక విద్యపై పట్టు సాధించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మాధురి

ఆమనగల్లు, జూలై 4(ఆంధ్ర జ్యోతి): విద్యార్థినులు ప్రాథమిక దశనుంచే శాస్త్ర, సాంకేతిక, పరిశోధన రంగాలపైదృష్టి సారించాలని నిర్మాణ్ సంస్థ ప్రతినిధి కంకనాల మాధురి, తహసీల్దార్ లలిత, ఎంపీడీవో మాధురి, మున్సిపల్ కమిషన్ శంకర్ నాయక్, ఎంఈవో పాండులు సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని కేజీబీవీలో స్టెల్లాంటిస్ గ్రూప్ సహకారంతో నిర్మాణ్ సంస్థ ఆధ్వర్యంలో రూ.8 లక్షలతో సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. శుక్రవారం పాఠశాల ఎస్‌వో పద్మజ్యోతితో కలిసి ల్యాబ్‌ల పరికరాలను సంస్థ ప్రతినిధులు స్కూల్‌కు అందజేసి ప్రారంభించారు. నిర్మాణ్ సంస్థ ప్రతినిధులను అధికారులు, టీచర్లు సత్కరించారు. సంఘ సేవకుడు పాపిశెట్టి రాము, శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ దార్ల చిత్తరంజన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హర్యానా గవర్నర్‌ను కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్


దత్తాత్రేయతో లావణ్యదేవేందర్ యాదవ్, రవీందర్

కొత్తూర్, జూలై 4(ఆంధ్రజ్యోతి): హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్, వైస్ చైర్మన్ జోలీ రవీందర్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. హర్యానాలోని గురుగ్రామ్‌లో రెండు రోజుల పాటు పార్లమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో.. దేశ నిర్మాణంలో స్థానిక సంస్థల పాత్ర అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమం ముగిసింది. దీనికి హాజరైన గవర్నర్ దత్తాత్రేయను చైర్‌పర్సన్‌తో పాటు, వైస్ చైర్మన్లు కలిశారు.



రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఖర్గే, చిత్రంలో సీఎం రేవంత్ రెడ్డి

క్రమశిక్షణకు మారు పేరు రోశయ్య

- యువనేతలకు ఆదర్శం ఆయన జీవితం
- మాజీ సీఎం రోశయ్య 92వ జయంతి సభలో మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి, పొన్నం
- చాగంటికి సత్కారంతో పాటు ప్రశంసా పత్రం

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/ఖైరతాబాద్/రవీంద్రభారతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణకు మారు పేరు.. అజాత శత్రువుగా తెలుగు ప్రజల మనసుల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్న నేత మాజీ సీఎం కొణిజేటి రోశయ్య అని మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు కొనియాడారు. నేటి యువతరం రోశయ్య రాజకీయ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, ఉమ్మడి రాష్ట్రంలో 16 సార్లు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డు సృష్టించారని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో రోశయ్య 92వ జయంతి సభను తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి మంత్రులు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, రోశయ్య కుటుంబ సభ్యులు శివసుబ్బారావు తదితరులు నివాళులర్పించారు. అనంతరం ప్రవచన కర్త, ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావును ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. చాగంటి మాట్లాడుతూ.. రోశయ్య గవర్నర్‌గా ఉన్న సమయంలో చెన్నైలో ప్రవచనాలు చెప్పేందుకు వెళ్లినప్పుడు రాజ్‌భవన్ నుంచి బయటొకొచ్చి మరీ ఆయన స్వాగతం పలికారని గుర్తు చేసుకున్నారు. మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి మాట్లాడుతూ.. రోశయ్య ఎప్పుడూ అందరికీ ఆదర్శ నాయకత్వాన్ని అందించే లక్ష్యంతో పనిచేశారని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా ఆదర్శ రాజకీయ నేతగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ.. 16 ఏళ్ల అప్పులు చేయకుండా ఉన్న దాంట్లో నిధులు సర్దుబాటు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లిన గొప్ప నేత రోశయ్య అని అన్నారు. ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతి నిర్వహించడం అభినందనీయమని.. ఆయన వాగ్ధాటి, ఛలోక్తులను ఎవరూ మర్చిపోరని చెప్పారు. రోశయ్య ఆలోచనలు, ఆయన దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాలను పార్టీలకతీతంగా ఇప్పుడు అనుసరించాల్సిన అవసరముందని గుత్తా అన్నారు. ఇటు డీజీపీ కార్యాలయంలోనూ రోశయ్య జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి అదనపు డీజీపీ మహేశ్ భగవత్ పూలమాల వేసి నివాళులర్పించారు.

రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ఖర్గే

మాజీ సీఎం రోశయ్య కాంస్య విగ్రహం హైదరాబాద్‌లో ఆవిష్కృతమైంది. లక్డీకాపూల్‌లోని సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో 450 కిలోల బరువుతో ఏర్పాటు చేసిన రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆయన జయంతి సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆవిష్కరించారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ కార్యక్రమానికి హాజరయ్యారు. కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, దయానంద్, సీనియర్ నేతలు వి.హన్మంతరావు, కేవీపీ రామచంద్రరావు, టీజీ వెంకటేశ్, ఆర్యవైశ్య మహాసభ తెలంగాణ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, రోశయ్య కుటుంబ సభ్యులు శివసుబ్బారావు, మూర్తి పాల్గొన్నారు.

గ్రూపులు కడతామంటే.. భయపడం!

(మొదటిపేజీ తరువాయి)

కమిటీల ఉమ్మడి, విస్తృత కార్యవర్గ సమావేశాల్లో ఖర్గే దిశానిర్దేశం చేశారు. ఇందులో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి పాల్గొన్నారు.

తెలంగాణ.. కాంగ్రెస్‌కు మోడల్ స్టేట్!

తెలంగాణను కాంగ్రెస్ మోడల్ స్టేట్‌గా దేశానికి చూపనున్నట్టు ఖర్గే చెప్పారు. కాంగ్రెస్ సైద్ధాంతాలకు అనుగుణంగానే రేవంత్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులున్నా హామీలను సమర్థంగా అమలు చేయడం అభినందనీయమని ప్రశంసించారు. నేతలు పార్టీ ఇచ్చిన పదవులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి తీరాలన్నారు. అంతకుముందు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ సమావేశంలో చెప్పారు. ఇక రేవంత్ మంత్రివర్గంలో పనిచేయాలన్నది తన కోరికని, జూబ్లీహిల్స్ టికెట్ ఇవ్వాలని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ చెప్పారు.

మంత్రులపై సీఎం రేవంత్ అసంతృప్తి!

మంత్రులు, ఆయా జిల్లాల్లో ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న నేతల తీరుపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నామినేటెడ్ పోస్టులకు ప్రతిపాదనలను షార్ట్ లిస్ట్ చేసి పంపాలని మంత్రులు, పీసీసీ చీఫ్‌ను నాలుగు నెలలుగా కోరుతున్నా.. స్పందించడం లేదని పేర్కొన్నారు. ప్రతిపాదనలు పంపితే వెంటనే ఆమోదిస్తానని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడగానే ప్రతిపాదనలను షార్ట్ లిస్ట్ చేసి ఉంటే.. నామినేటెడ్ పోస్టుల్లో ఒక టర్మ్ అవకాశాలు పూర్తయ్యేవని వివరించారు.

నెలాఖరుకల్లా నామినేటెడ్ పోస్టుల భర్తీ:ఖర్గే

జూలై నెలాఖరుకల్లా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని సీఎం రేవంత్, మంత్రులు, టీపీసీసీ చీఫ్‌కు ఖర్గే స్పష్టం చేశారు. దీన్ని సమన్వయం చేసుకునే బాధ్యత పీసీసీ చీఫ్‌దేనని.. పార్టీ కోసం కష్టపడిన వారికి, సమర్థులకే పదవులు ఇవ్వాలని సూచించారు. 'ప్రభుత్వంపై పార్టీ ఫిర్యాదు చేయడం చూశాం గానీ, పార్టీపై ప్రభుత్వం ఫిర్యాదు చేయడం ఇక్కడే చూస్తున్నా' అని ఖర్గే వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ కార్యకర్తలపై పెట్టిన కేసులను ఎత్తివేసేందుకు చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌కు ఖర్గే సూచించారు. పార్టీకి కార్యకర్తలే బలమని, కాపాడుకోవాలని చెప్పారు.



గాంధీభవన్ చేరుకున్న కాంగ్రెస్ చీఫ్ ఖర్గేతో సీఎం రేవంత్

పార్టీ పదవులను తేలికగా తీసుకోవద్దు: సీఎం

నేతలు పార్టీ పదవులను తేలికగా తీసుకోవద్దని సీఎం రేవంత్ సూచించారు. పార్టీ పదవులతో గుర్తింపు, గౌరవం దక్కుతాయని, రాజకీయాల్లో ఎదుగుదలకు దోహదపడతాయని చెప్పారు. భవిష్యత్తులో అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరుగుతాయని, ఎక్కువ మందికి అవకాశాలు వస్తాయని వివరించారు. నూతన నాయకత్వానికి 2029 ఎన్నికలు వేదిక కావాలని కోరారు. అందరూ కష్టపడి పనిచేసి.. కాంగ్రెస్‌ను రెండో సారి అధికారంలోకి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో వచ్చే పదేళ్లు కాంగ్రెస్‌దే అధికారమని ధీమావ్యక్తం చేశారు. పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ మాట్లాడుతూసామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో 90 సీట్లతో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలపై ఏం చేద్దాం?

ఈ నెల 7న క్రమశిక్షణా చర్యల కమిటీ భేటీ

తెలంగాణలో టీడీపీ కోవర్టులున్నారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, వాటిపై వచ్చిన ఫిర్యాదులపై టీపీసీసీ క్రమశిక్షణా చర్యల కమిటీ జూలై 7న గాంధీభవన్‌లో భేటీ కానుంది. ఆధారాలు చూపకుండా అనిరుధ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను పార్టీ తీవ్రంగా పరిగణిస్తోందంటూ టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఇప్పటికే ప్రకటించారు. పార్టీ ఎమ్మెల్యే అయినందున.. అనిరుధ్‌రెడ్డికి క్రమశిక్షణా చర్యల కమిటీ షోకాజ్ నోటీసు జారీ చేస్తుందా లేక చర్యల కోసం ఏఐసీసీ క్రమశిక్షణా కమిటీకి సిఫార్సు చేస్తుందా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఇలా ఉంటే గాంధీభవన్‌లో చైర్మన్ మల్లురవి అధ్యక్షతన క్రమశిక్షణా చర్యల కమిటీ భేటీ అయింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నేతల వివాదంపై పార్టీ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అభిప్రాయం సేకరించింది. అనంతరం మీడియాతో నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తాజా రాజకీయ పరిస్థితులపై కమిటీ పెద్దలు తనతో మాట్లాడారన్నారు. చిన్న చిన్న బేధాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని, త్వరలో అన్ని సమస్యలూ పరిష్కారం అవుతాయని చెప్పారు.

డీ అడిక్షన్ కేంద్రాల ఏర్పాటు చారిత్రాత్మక మైలురాయి

- సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్

హైదరాబాద్/సైదాబాద్/యాదగిరిగుట్ట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నేరాలు పాల్పడి జైలుకు వచ్చిన వారిలో పరివర్తన తీసుకురావడమే లక్ష్యంతో రాష్ట్ర జైళ్లలో డీ అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయడం చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి, నేషనల్ లీగల్ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. చంచల్‌గూడ జైలులో నివృత్తి డీ అడిక్షన్ సెంటర్‌ను శుక్రవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. మత్తుకు బానిసైన ఖైదీలకు వైద్య చికిత్స, కౌన్సిలింగ్‌ల ద్వారా మంచి పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంగా డీ అడిక్షన్ కేంద్రాల ఏర్పాటు అభినందనీయమని చెప్పారు. జస్టిస్ సుజోయ్‌పాల్ మాట్లాడుతూ ఖైదీలు మత్తు వ్యసనాన్ని అధిగమించి వారి జీవితాలను పునర్నించడానికి సహాయపడే వాతావరణం చంచల్‌గూడ జైలులో ఉందని ప్రశంసించారు. కాగా, అంతకు ముందు యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడిని జస్టిస్ సూర్యకాంత్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద ఆశీర్వచనం చేశారు. గర్భాలయంలో స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్నిన్యాయమూర్తికి అందజేశారు. కాగా, బాలల హక్కుల రక్షణ అంశంపై 'వాయిస్ ఫర్ ది వాయిస్‌లెస్' అనే పేరుతో శని, ఆదివారాల్లో రాష్ట్ర స్థాయి స్టేక్ హోల్డర్ల సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి, హై కోర్ట్ చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొననున్నారు.



జస్టిస్ సూర్యకాంత్‌కు నృసింహుడి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈఓ

34 కోట్ల రన్యారావ్ ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ

బెంగళూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బంగారం అక్రమ రవాణా కేసులో పట్టుబడిన నటి రన్యారావ్‌కు చెందిన రూ.34.12 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. బెంగళూరు విక్టోరియా లే అవుట్‌లోని ఇల్లు, అర్కావతి లే అవుట్‌లో స్థలం, తుమకూరులో పారిశ్రామిక స్థలం, ఆనేకల్ తాలూకాలోని వ్యవసాయ భూమిని అటాచ్ చేశామని ఈడీ అధికారులు శుక్రవారం ప్రకటించారు. దుబాయ్ నుంచి రూ.12.56 కోట్ల విలువైన బంగారాన్ని తెస్తూ.. ఈఏడాది మార్చి 3న కెంపేగౌడ విమానాశ్రయంలో రన్యారావ్ పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ కేసులో రన్యారావ్, రాజు, సాహిల్‌జైన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ముగ్గురూ పరప్పన అగ్రహార జైలులో ఉన్నారు.

తెరుచుకున్న తుంగభద్ర గేట్లు!

గద్వాల/దోమలపెంట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు క్రమంగా వరద పెరుగుతోంది. కృష్ణా, తుంగభద్ర నదుల ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద పెరుగుతోంది. శుక్రవారం కర్ణాటకలోని తుంగభద్ర గేట్లు తెరుచుకున్నాయి. ప్రాజెక్టుకు 75,612 క్యూసెక్కుల ప్రవాహాలు చేరగా 58 గేట్లకు గాను 21 గేట్లను ఎత్తి 62,612 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 105.79 టీఎంసీలకు.. ప్రస్తుతం 75.84 టీఎంసీలున్నాయి. దిగువనున్న శ్రీశైలం ప్రాజెక్టుకు 1,09,777 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఏపీ, తెలంగాణ విద్యుదుత్పత్తి కోసం 56,998 క్యూసెక్కులను వినియోగిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలకు ప్రస్తుతం 169.86 టీఎంసీలున్నాయి. తుంగభద్ర గేట్లు తెరవడంతో శ్రీశైలానికి వరద మరింత పెరిగే అవకాశముంది. ఇక ఆల్మట్టికి వరద స్థిరంగా కొనసాగుతోంది. 94,767 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. లక్ష క్యూసెక్కులను దిగువకు విడుస్తున్నారు. జూరాలకు 1.15 లక్షల క్యూసెక్కుల ప్రవాహాలు వస్తుండగా 14గేట్ల ద్వారా 95,566, విద్యుదుత్పత్తి ద్వారా 29,494 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.

బ్రిడ్జిలు, సొరంగాలున్న హైవేలపై టోల్ చార్జీలు సగానికి తగ్గింపు

న్యూఢిల్లీ, జూలై 4: జాతీయ రహదారులపై సొరంగాలు, బ్రిడ్జిలు, ఫ్లైఓవర్లు లేదా ఎలివేటెడ్ హైవేలు వంటి నిర్మాణాలున్న భాగాలకు టోల్ రేట్లను కేంద్ర ప్రభుత్వం 50శాతం వరకు తగ్గించింది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ టోల్ చార్జీలను లెక్కించడానికి కొత్త పద్ధతి/ఫార్ములాను నోటిఫై చేస్తూ ఈ నెల 2న నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. జాతీయ రహదారిపై ఉండే ప్రతి కిలో మీటరు వంతెనలు లేదా సొరంగాలకు వాహనదారులు సాధారణ టోల్ కన్నా పది రెట్లు ఎక్కువ చెల్లిస్తున్నారు. దీన్ని సవరిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, సొరంగాలున్న ప్రాంతాల్లో టోల్ రేటును 50 శాతం వరకు తగ్గించినట్టు ఓ అధికారి పేర్కొన్నారు.

ఆగుతూ.. సాగుతూ

(ఐదో పేజీ తరువాయి)

ఆరు చెట్లు మాత్రమే (30సెం.మీ. నుంచి 90సెం.మీ వ్యాసం ఉన్నవి) తరలించడానికి అనువైనవని 'సేవ్ బనియన్స్' సంస్థ వాదనను సమర్థించింది. అంతేకాదు 5.8 కిలోమీటర్ల మేర దట్టమైన, పురాతన చెట్ల వరుసలు ఉన్నాయని, వీటిని తరలించడం అటవీ మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలకు విరుద్ధమని గుర్తించింది. ఈ ప్రాంతంలో 84కుపైగా పక్షి జాతులు ఉన్నాయని.. పక్షుల గూళ్లు ఉన్న చెట్లను గుర్తించకపోవడం, జెడ్ ఎస్ఐ నివేదిక లేకుండానే ఈఏసీ.. ఈఐఏను ఆమోదించడం చట్టవిరుద్ధమని తేల్చిచెప్పింది. ఈఏసీ నివేదికను పబ్లిక్ డొమైన్‌లో ఉంచకపోవడంపైనా ఆగ్రహం వ్యక్తం చేసింది.

కొత్త అలైన్‌మెంట్ సాధ్యమేనా?

ఎన్జీటీ 2023 ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని, రోడ్డు ట్రాన్స్‌పోర్ట్, హైవేస్ మంత్రిత్వ శాఖ 2018లో జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం గ్రీన్ ఫీల్డ్ అలైన్‌మెంట్‌ను పరిశీలించాలని ఆదేశించింది. అధికారులు దీన్ని ప్రకారం ముందుకు వెళ్లాలనుకుంటే పోలీస్ అకాడమీ నుంచి మొయినాబాద్ వరకు మర్రి చెట్లు లేవు. మొయినాబాద్ బైపాస్ (భాస్కర ఆసుపత్రి నుంచి కనకమామిడి శివారు) చేవెళ్లలో బైపాస్ (కేసారం నుంచి చేవెళ్ల శివారు)తో దాదాపు 350 వరకు చెట్లు సేఫ్ అవుతున్నాయి. కనకమామిడి నుంచి కేసారం వరకు, చేవెళ్లలోని మోడల్ కాలనీ స్టేజీ నుంచి మన్నెగూడ వరకు దాదాపు 522 చెట్లు ఉన్నాయి. ఈ ప్రాంతంలో ప్రభుత్వ, ప్రైవేట్ భూములే ఉండడంతో భూసేకరణకు అవకాశం ఉంది. కేవలం ముడిమ్యాల, కందవాడ పరిధిలో రిజర్వ్ ఫారెస్ట్ ఉండడంతో ఆ శాఖకు సంబంధించిన పర్మిషన్ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ ఫారెస్ట్‌లో మర్రి చెట్లతో పాటు ఇతర చెట్లను ఇప్పటికే నోటిఫై చేసిన అధికారులు... చెట్ల తొలగింపు పనులు కూడా చేపట్టారు. దీన్ని ఇంకొంత విస్తరిస్తే సరిపోతోంది. మర్రి చెట్ల మధ్యలో ఉన్న రోడ్డును డబుల్ లేన్‌గా మార్చి.. చెట్ల అవతలి వైపు ఇంకో డబుల్ లేన్ రోడ్డు వేసే అవకాశం కూడా ఉంది. ఈ పద్ధతిలో భూసేకరణ కూడా పెద్దగా అవసరం ఉండదు.

కొనసాగుతున్న బైపాస్ పనులు..

మర్రి చెట్ల కారణంగా హైవే పనులు నిలిచిపోగా అండర్ బైపాస్ పనులు కొనసాగుతున్నాయి. మొయినాబాద్ వద్ద 4.35 కిలోమీటర్ల మేర, చేవెళ్ల వద్ద 6.35 కిలో మీటర్ల మేర బైపాస్ రోడ్లను నిర్మిస్తున్నారు. బైపాస్ మధ్యలో అండర్‌పాస్‌లు నిర్మిస్తున్నారు. నిర్మాణంలో నాణ్యత పాటించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2022 ఏప్రిల్ 29న కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ 12 జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శంకుస్థాపన, జాతికి అంకితం చేశారు. అందులో భాగంగా ఎన్‌హెచ్-163 హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డు (టీఎస్‌పీఏ జంక్షన్) నుంచి మన్నేగడ వరకు 4 వరసల రహదారి ఉంది. శంకుస్థాపన చేశారు. 46 కిలో మీటర్లు పొడవు, రూ.928.41 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ పనుల కాంట్రాక్ట్‌ను మెఘా ఇంజనీరింగ్ కన్‌స్ట్రక్షన్ సంస్థ చేజిక్కించుకుంది. రోడ్డు విస్తరణ పనుల కోసం 145.42 హెక్టార్లు సేకరించాల్సి ఉండగా దాదాపు 95 శాతం భూసేకరణ పూర్తి చేశారు.



చేవెళ్లలో గుంతల పడి డేంజర్‌గా మారిన హైవే

2018లో నేషనల్ హైవేగా అప్‌గ్రేడ్..

స్టేట్ హైవేగా ఉన్న ఈ రోడ్డును కేంద్ర ప్రభుత్వం 2018లో ఎన్‌హెచ్ 163గా అప్‌గ్రేడ్ చేసింది. ఈ మేరకు జాతీయ రహదారుల చట్టం-1956 కింద జూలై, 2019 ఫిబ్రవరిలో నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. వీటి ప్రకారం సర్వే చేసిన అధికారులు కొత్త అలైన్‌మెంట్‌కు అవకాశం ఉన్నా.. పాత మార్గాన్ని విస్తరించేందుకు నిర్ణయించారు. నాలుగు లైన్ల రహదారిగా విస్తరణలో భాగంగా వికారాబాద్ జిల్లా పూడూరు మండలం అంగడి చిట్టంపల్లి వద్ద టోల్ ప్లాజాను ఏర్పాటు చేయనున్నారు.



రోశయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న డీఆర్వో సంగీత

రోశయ్య సేవలు చిరస్మరణీయం

- డీఆర్వో సంగీత

రంగారెడ్డి అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య సేవలు చిరస్మరణీయమని డీఆర్వో సంగీత అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రోశయ్య జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక శాఖ మంత్రిగా 16సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని, ఉమ్మడి ఏపీలో మర్రి చెన్నారెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, వైఎస్సార్ హయాంలో వివిధ శాఖలకు మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారన్నారు. మహనీయుల ఆశయాలను నేటితరం యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడలశాఖ అధికారి వెంకటేశ్వర రావు, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ అధికారి సునీల్, సిబ్బంది, పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలి

- కలెక్టరేట్ ఎదుట నందనవనం వాసులు ఆందోళన

రంగారెడ్డిఅర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని సరూర్‌నగర్ మండలం నందనవనం కాలనీ వాసులు డిమాండ్ చేశారు.శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. తమకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని కోరుతూ డీఆర్వో సంగీతకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ 2009కి ముందు నందనవనం కాలనీలో గుడిసెలు వేసుకున్నామన్నారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఖాళీ చేయించిందన్నారు. ఇప్పటికైనా అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని కాలనీ వాసులు కోరారు.

టీడీపీకి పూర్వవైభవం తేవాలి

మంచాల, జూలై 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తీసుకురావాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని ఆ పార్టీ రాష్ట్ర నేత గుమ్మడి అంజిరెడ్డి అన్నారు. టీడీపీ మంచాల మండల కార్యవర్గ సమావేశం శుక్రవారం ఆరుట్లలో జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పరిశీలకుడిగా గుమ్మడి అంజిరెడ్డి హాజరయ్యారు. నూతన అధ్యక్షుడిగా కొంగర వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పగడాల ఆనంద్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా మంగళారం శంకర్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా శ్రీరామ్ హన్మంతు, ఉదావత్ శ్రీనివాస్, జెనిగె పర్వతాలు యాదవ్‌లు ఎన్నికయ్యారు. టీడీపీ రాష్ట్రనేత వంగాల కృష్ణ, సీహెచ్ చక్రపాణి, జక్క రాంరెడ్డి, జిలమోని రవీందర్, మహేందర్, చీమల వేణుయాదవ్, జొన్నలగడ్డ పాండు, కొల్లోజు జంగాచారి, మాడపాకుల శేఖర్, జవహర్, శ్రీను, హనుమ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

షాబాద్ ఏవోకు ఏడీఏగా పదోన్నతి

షాబాద్, జూలై 4(ఆంధ్రజ్యోతి): షాబాద్ మండల వ్యవసాయాధికారిగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశం ఏడీఏగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా వికారాబాద్‌కు శుక్రవారం బదిలీ అయ్యారు. షాబాద్ మండల వ్యవసాయాధికారిగా 2018 నుంచి విధులు నిర్వహిస్తున్న వెంకటేశం ఏడీఏగా ప్రమోషన్ పొంది బదిలీ అయ్యారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- నూజివీడు పరిశ్రమలో జీవోటీ కాటన్ విత్తనాలను నిర్వీర్యం చేసిన అధికారులు

నందిగామ, జూలై 4(ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, ప్రభుత్వం నకిలీ విత్తనాల తయారుదారులపై కఠిన చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండల కేంద్రంలోని నూజివీడు విత్తన అభివృద్ధి పరిశ్రమలోని కాటన్ విత్తన తయారీ కేంద్రంలో నకిలీ విత్తనాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వీర్యం చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే అధికారుల సమక్షంలో నిర్వీర్యం చేస్తున్న పత్తి విత్తనాలను పరిశీలించి మాట్లాడారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందజేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విత్తనాల అభివృద్ధి కోసం పరిశ్రమ యాజమాన్యం గతంలో గద్వాల నియోజకవర్గ రైతులు 784 మందితో ఒప్పందం కుదుర్చుకొని పత్తి సాగు చేయగా 1,281 క్వింటాళ్ల దిగుబడి విఫలం కావడంతో అధికారుల సమక్షంలో విత్తనాన్ని నిర్వీర్యం చేశారు. కార్యక్రమంలో అధికారులు వ్యవసాయశాఖ ఏడీ రమాదేవి, ఏవోలు శోభారాణి, తహసీల్దార్ రాజేశ్వర్, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నూజివీడు పరిశ్రమలో ఫెయిల్ అయిన జీవోటీ కాటన్ విత్తనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలి

వికారాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను మార్చేందుకు కుట్రలు చేస్తుందని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గీత, ఏటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. కార్మిక చట్టాలను కాపాడుకోవడానికి ఈ నెల 9న నిర్వహించే ఒక్క రోజు సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, నాయకులు సుదర్శన్, సతీష్‌కుమార్, నవీన్‌కుమార్, లక్ష్మయ్య, లక్ష్మి, ఎల్లమ్మ, అనిల్, శ్రీనివాస్, గౌస్ పాషా పాల్గొన్నారు.


ప్రార్థనాలయాల్లోనే ప్రశాంతత

మొయినాబాద్ రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): మానవాళికి ప్రశాంతత లభించేది ప్రార్థనాలయాల్లోనేనని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన చర్చి భవన ప్రారంభోత్సవంలో ఆయన శుక్రవారం పాల్గొని పాస్టర్ సైమన్, చర్చి నిర్వాహకులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి అనంతరెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే రత్నం, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్, కంజర్ల భాస్కర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, శ్రీహరి యాదవ్, రవియాదవ్, రాజయ్య యాదవ్, మల్లేష్ యాదవ్, చర్చి కమిటీ సభ్యులు, పాస్టర్లు పాల్గొన్నారు.



చర్చి నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పాస్టర్ సైమన్ తదితరులు

శాకాంబరి అవతారంలో వాసవి మాత



తాండూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని తాండూరు నగరేశ్వర ఆలయంలో వాసవీమాత శాకాంబరీగా భక్తులకు దర్శనమించారు. శుక్రవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్లు కొట్రిక విజయలక్ష్మి, తాటికొండ స్వప్న, వాసవి మహిళ సంఘం అధ్యక్షురాలు కొట్రిక నాగలక్ష్మీ శ్రీకాంత్, కార్యదర్శి మంకాల స్వప్న, కోశాధికారి శోభ, సభ్యులు పాల్గొన్నారు.

ఫలాంబరిగా సర్వ మంగళాదేవి

ఘట్‌కేసర్, జూలై 4(ఆంధ్రజ్యోతి): పోచారంలోని సర్వమంగళ సమేత స్ఫటిక లింగేశ్వర స్వామి ఆలయంలో ఆషాఢ మాస శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా రెండో శుక్రవారం అమ్మవారిని ఫలాంబరిగా అలంకరించారు. వివిధ రకాల పండ్లతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని నాలుగు వారాలు నాలుగు రకాలుగా అలంకరిస్తారు. ఈ సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

బొంరాస్‌పేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్య సాధనతో చదవాలని, ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని జూనియర్ కళాశాలల జిల్లా నోడల్ అధికారి శంకర్‌నాయక్ అన్నారు. శుక్రవారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో హరిలాల్, నాయకులు నర్సింహులుగౌడ్, రాంచంద్రారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేశ్‌రెడ్డి

వైవీ సుజనకు డాక్టరేట్



శామీర్‌పేట, జూలై 4(ఆంధ్రజ్యోతి): 'ఇంపాక్ట్ ఆఫ్ ఈ కామర్స్ ఆన్ కన్స్యూమర్ డెసిషన్ మేకింగ్ టవర్డ్స్ ది పర్చేస్ ఆఫ్ ఎలక్ట్రానిక్ గూడ్స్ ఇన్ హైదరాబాద్' అనే అంశంలో శామీర్‌పేటకు చెందిన యార్లగడ్డ వెంకటసుజనకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్‌లోని రాయలసీమ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. కుప్పంలోని స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్, ద్రవిడియన్ యూనివర్సిటీ డీన్ ఆచార్యులు జీఎల్ నారాయణప్ప పర్యవేక్షణలో చేసిన పరిశోధనలను గుర్తించి రాలయసీమ యూనివ్సర్సిటీ వైవి సుజనకు ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. సుజన ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

నేషనల్ డిఫెన్స్‌కి ఆర్బీవోఎల్ విరాళం

తాండూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): తాండూరు ప్రాంతంలోని రాడికల్ బయో ఆర్గానిక్స్ లిమిటెడ్(ఆర్బీవోఎల్) జాతీయ రక్షణ నిధి(నేషనల్ డిఫెన్స్)కి విరాళాన్ని ప్రకటించారు. పహెల్గాం ఉగ్రదాడి తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విజ్ఞప్తి మేరకు ఆర్బీఎల్ సంస్థ జాతీయ రక్షణ నిధికి రెండు నెలలుగా విరాళాన్ని అందజేస్తుంది. అందులో భాగంగా శుక్రవారం ఆర్బీవోఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి జాతీయ రక్షణ నిధికి రూ. 3 లక్షల విరాళాన్ని ప్రకటించి చెక్కు ద్వారా సంబంధిత ఖాతాకు జమ చేశారు.

సైన్స్ టీచర్‌పై సస్పెన్షన్ ఎత్తివేత హర్షణీయం

వికారాబాద్, జూలై 4(ఆంధ్రజ్యోతి): బయో సైన్స్ టీచర్ కాసింబిపై సస్పెన్షన్ ఎత్తివేసిన విద్యాశాఖ ఉత్తర్వులను హర్షిస్తున్నామని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం పేర్కొన్నారు. యాలాల జడ్పీ హై స్కూల్‌లో విధులు నిర్వర్తిస్తున్న కాసింబి ఎస్సీఈఆర్టీ పాఠాలు బోధించడమే నేరమా? అని ప్రశ్నించారు. ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాల్సిన అధికారులే బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారన్నారు.

సబ్సిడీపై కూరగాయల నారు

దుద్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): హైబ్రీడ్ కూరగాయల తోటల విస్తరణ పథకం కింద టమాట, మిరప, వంకాయ వంటి పంటలకు సంబంధించి ఉద్యానవన శాఖ జీడిమెట్ల నుంచి ఉచితంగా కూరగాయల నారును అందిస్తున్నట్లు ఉద్యానవన శాఖ అధికారులు శుక్రవారం తెలిపారు. కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, పట్టా పాసుబుక్, బ్యాంకు ఖాతా జిరాక్స్, పాస్‌ఫొటోతో వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు.

ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలి

మూడుచింతలపల్లి/చౌడాపూర్/బొంరాస్‌పేట్, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఫార్మర్ రిజిస్ట్రీలో ప్రతి రైతు తమ పేర్లను నమోదు చేసుకోవాలని మూడుచింతలపల్లి మండల వ్యవసాయధికారి రవికుమార్, చౌడాపూర్ వ్యవసాయ అధికారి విశ్వనాథ్ బొంరాస్‌పేట్ ఏఈవో స్వాతి కోరారు. రైతు ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయిస్తామన్నారు. మూడుచింతలపల్లి పరిధిలోని ప్రతి గ్రామంలో ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం నిర్వహిస్తామని, పేరు నమోదుకు రైతులు ఏఈవో లక్ష్మణ్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రశాంతంగా మొహర్రం జరుపుకోవాలి

పూడూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): మొహర్రంను ప్రశాంతంగా జరుపుకోవాలి చెన్‌గోముల్ ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని చెన్‌గోముల్‌లో గ్రామస్తులతో మాట్లాడారు. కుల మతాలకతీతంగా కలిసిమెలిసి ఉంటే ఘర్షణ వాతావరణం ఉండదని అన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపిక

దుద్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ పోటీలకు విద్యార్థి ఎంపికయ్యాడు. ఇటీవల వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో దుద్యాల మండలంలోని చెట్టుపల్లి తండాకు చెందిన రాథోడ్ ప్రవీణ్ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో విజయరామారావు తెలిపారు.

ప్రొసీడింగ్స్ అందజేత

దోమ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయినాపూర్ గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు ప్రొసీడింగ్స్ అందించారు. అర్హులకు ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, పరిగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడి పాల్గొన్నారు.

బడికి విరాళం

పరిగి, జూలై 4(ఆంధ్రజ్యోతి): శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో రేకులషెడ్డు నిర్మాణానికి పూర్వ విద్యార్థులు విరాళం అందజేశారు. పాఠశాలలో 2001-02 టెన్త్ బ్యాచ్ విద్యార్థులంతా కలిసి రూ.1,05,116లు జమ చేసి శుక్రవారం ప్రధానాచార్యులు మల్లేశ్‌కు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి వెంకటేశం, మారుతీకిరణ్, భీంసేన్‌రావు, బ్రహ్మయ్య, వెంకట్రాములు, ప్రశాంత్ పాల్గొన్నారు.

అనుమానమే పెనుభూతమై..

గొంతునులిమి భార్యను హతమార్చిన భర్త

మేడ్చల్ పట్టణంలో దారుణం

మేడ్చల్ టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో ఓ భర్త తన భార్య గొంతు నులిమి దారుణంగా హతమార్చాడు. ఈ ఘటన మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. భవన నిర్మాణ మేస్త్రీగా పని చేస్తున్న ఆంధ్రప్రదేశ్, ప్రకాశం జిల్లా కందుకూరు మండలం ముప్పుల గ్రామానికి చెందిన రాంబాబుతో ప్రశాంతి(22)తో ఏడాదిన్నర క్రితం వివాహం జరిగింది. ప్రస్తుతం వారికి ఐదు నెలల కూతురు. వివాహం జరిగిన నాటి నుంచి రాంబాబు తన భార్యకు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో వేధించేవాడు. ఈ విషయంలో తరుచూ ఇద్దరి మధ్య గొడవలు జరగగా కుటుంబ సభ్యులు కల్పించుకుని సముదాయించే వారు. పాప పుట్టాక రాంబాబు ప్రవర్తన మారుతుందని ప్రశాంతి కుటుంబ సభ్యులు భావించనప్పటికీ అతని ప్రవర్తన ఏమాత్రం మారలేదు. ఇదే క్రమంలో గురువారం రాత్రి ప్రశాంతి, రాంబాబుల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో రాంబాబు ఆగ్రహంతో భార్య ప్రశాంతి గొంతు నులిమి దారుణంగా హతమార్చి కూతురిని అక్కడే వదిలేసి పరారయ్యాడు. శుక్రవారం ఉదయం ప్రశాంతి కుటుంబ సభ్యులు రాంబాబుకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. అప్పటికే తల్లి మృతదేహం వద్ద రోదిస్తున్న పాప చప్పుడు విని స్థానికులు ఇంటి వద్దకు వెళ్లి చూడగా ప్రశాంతి మృతదేహం కనపడింది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి విచారణ చేపట్టారు. ప్రశాంతి గొంతు నులిమి హత్య చేసిన ఆనవాళ్లను గుర్తించి విచారణ చేపట్టారు. రాంబాబు పరారీలో ఉన్నాడని అతని కోసం గాలిస్తున్నారని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏసీపీ తెలిపారు.



నిందితుడు రాంబాబు



ప్రశాంతి(ఫైల్)



దోమ మండలం నుంచి హైదరాబాద్‌కు తరలి వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

ఖర్గే సభకు కాంగ్రెస్ శ్రేణులు

హైదరాబాద్ తరలిన నాయకులు

హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బహిరంగ సభకు వికారాబాద్, మేడ్చల్ మల్కాజిగి జిల్లాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఆయా మండలాల అధ్యక్షుల ఆధ్వర్యంలో బస్సులు, ప్రైవేటు వాహనాల్లో బయలుదేరారు. పార్టీ మండలాల అధ్యక్షుడు జెండా ఊపి కార్యకర్తలను, నాయకులను హైదరాబాద్ తరలించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు సమష్టిగా అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, జూలై 4



ఘట్‌కేసర్: పోచారం నుంచి కాంగ్రెస్ సభకు తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

మాజీ సీఎం రోశయ్య సేవలు మరువలేనివి



రోశయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కీసర, జూలై4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత రోశయ్య జయంతిని కీసరలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని కీసర ప్రధాన చౌరస్తాలో రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఘట్‌కేసర్ రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని నీలిమా మెడికల్ సైన్స్ కళాశాల డీన్ డాక్టర్ లక్ష్మి తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్‌లోని నీలిమ మెడికల్ సైన్స్ కళాశాలలో శుక్రవారం మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత చెడు వ్యవసనాలకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాల బారిన పడొద్దని సూచించారు. ఒక్కసారి అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగంపై పోస్టర్ ప్రదర్శన, లఘుచిత్ర ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి

మేడ్చల్ టౌన్/కొడంగల్ రూరల్/పరిగి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డు కొమరయ్య వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం వికారాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల వ్యాప్తంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ప్రధాన చౌరస్తాల్లోని ఆయన విగ్రహాల వద్ద, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేడ్చల్‌లో వివేకానంద చౌరస్తా మాజీ కౌన్సిలర్ కురుమ మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో, కొడంగల్‌లో కురుమ సంఘం జిల్లా కార్యదర్శి కురువ నాగప్ప ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద, పరిగిలో ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్యకు నివాళులర్పించి ఆయన పోరాటస్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు.



మేడ్చల్ టౌన్: దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బ్యానర్ తొలగించినందుకే విగ్రహం ధ్వంసం

పరిగి, జూలై 4(ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండలం పుట్టపహాడ్ గ్రామంలో బ్యానర్ తొలగించినందుకు అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారని, ఈ కేసులో నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ నేతి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. పుట్టపహాడ్ గ్రామానికి చెందిన హర్షవర్ధన్ ప్రమాదంలో మృతి చెందగా, అతడికి శ్రద్ధాంజలి కోసం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఫ్లెక్సీ కట్టారు. బ్యానర్ కట్టి చాలా రోజులైందని అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఫ్లెక్సీని తొలగించాడు. దీంతో తన తమ్ముడి బ్యానర్ తొలగిస్తారా? అని హర్షవర్ధన్ అన్న సంగ్రనోని బ్రహ్మం, బంటు మహేశ్, కమ్మరి సూర్యప్రకాశ్ అలియాస్ సత్యనారాయణ, సంద్రాసు రమేశ్ జూన్ 21న అర్ధరాత్రి అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. బ్రహ్మం రాయితో విగ్రహాన్ని పగులగొట్టగా, మిగతా ముగ్గురు కాలపా ఉన్నారు. ఈ కేసులో విచారణ జరిపి నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ శ్రీనివాస్‌రెడ్డి, కులకచర్ల ఎస్ఐ రమేశ్, సిబ్బంది ఉన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

శామీర్‌పేట, జూలై 4(ఆంధ్రజ్యోతి): కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అలియాబాద్‌కు చెందిన బాధితులు బానూరి శ్రీనివాస్ రెడ్డి, బానూరి దిలీప్‌కుమార్‌రెడ్డి శుక్రవారం మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. లాల్‌గడి మలక్‌పేట పరిధిలోని సర్వే నంబర్-641లో తమ పట్టా స్థలాన్ని, రోడ్డు స్థలాలను కొందరు కబ్జా చేసి పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా మలక్‌పేట పరిధిలో మధుకర్‌రెడ్డి అనే వ్యక్తి ఎలాంటి అనుమతులను తీసుకోకుండా అక్రమ నిర్మాణాలను చేస్తున్నట్లు గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. దీనిపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. అలియాబాద్ మాజీ సర్పంచ్ ఎల్లయ్య, ఉన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



కీసర రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చందర్‌రావు పిలుపునిచ్చారు. బీజేపీ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి కందాడి సత్తిరెడ్డి శుక్రవారం నగరంలోని రామ్‌చందర్ రావు ఇంటికి వెళ్లి ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సూర్యశేఖర్‌రెడ్డి, దొబ్బల శ్రీశైలం, తోకటి దుర్గేష్, తదితరులు ఉన్నారు.

చెంగోల్ బడిలో ఆటస్థలం ఏర్పాటుకు చర్యలు

తాండూరు రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం చెంగోల్ జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఊరగుట్ట తొలగింపునకు చర్యలు చేపట్టారు. చెంగోల్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో ఊరగుట్ట ఉండటంతో విద్యార్థులకు ఆట స్థలం లేక క్రీడలకు దూరమవుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే రూ.15లక్షల నిధులు మంజూరు చేయించి పాఠశాల ఆవరణలోని ఊరగుట్ట తొలగింపునకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం జేసీబీ ద్వారా గుట్టను తొలగించే పనులు చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్యానాయక్, స్థానిక నాయకుడు రాముయాదవ్ దగ్గరుండి పనులు చేయిస్తున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో 350 మంది విద్యార్థులున్న పాఠశాలకు ఆట స్థలం రాబోతుందన్నారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పాఠశాల ఆవరణలోని ఊరగుట్టను జేసీబీతో చదును చేస్తున్న దృశ్యం

సంక్షిప్తం

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో మోసం

ఘట్‌కేసర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అరచేతిలో వైకుంఠం చూపిస్తోందని, ఇళ్ల పేరుతో పేదలను మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఘట్‌కేసర్‌లోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ శుక్రవారం తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కమిషనర్ మేడ్చల్ జిల్లాలోని ఖాళీ స్థలాల వేలం కోసం ప్రకటనలు జారీ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

కార్మిక సమ్మెను జయప్రదం చేయాలి

వికారాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను మార్చేందుకు కుట్రలు చేస్తుందని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గీత, ఏటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. కార్మిక చట్టాలను కాపాడుకోవడానికి ఈ నెల 9న నిర్వహించే ఒక్క రోజు సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మైల్వార్ పంచాయతీకి వీధి లైట్ల అందజేత

బషీరాబాద్, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైల్వార్ గ్రామ పంచాయతీలో వీధి లైట్ల సమస్య తీరింది. కొన్ని రోజులుగా గ్రామంలోని ప్రధాన, అంతర్గత రోడ్ల పక్కన స్తంభాలకు వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా నిధుల లేమితో స్పందించలేదని గ్రామస్తులు వాపోయారు. ఈ విషయం గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువనేత సంఘీశెట్టి సతీష్‌తో మొహర్రం పండుగ ఉందని, వీధి లైట్లు లేక చీకటిలో మగ్గుతున్నామని స్థానిక తెలియజేశారు. స్పందించిన సతీశ్ సొంత ఖర్చులతో 100 ఎల్ఈడీ బల్బులు తెప్పించి గ్రామ కార్యదర్శి నర్సింహగౌడ్‌కు శుక్రవారం పంచాయతీ కార్యాలయం వద్ద స్వయంగా అందజేశారు. స్తంభాలకు వీధిలైట్లు ఏర్పాటు చేసేందుకు గ్రామ కార్యదర్శి చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.నరేందర్, స్థానికులు పాల్గొన్నారు.

46 వేల మొక్కలు నాటుతాం

పరిగి, జూలై 4(ఆంధ్రజ్యోతి): పరిగి పట్టణంలో 46 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మున్సిపల్ కమిషనర్ వెంకట య్య తెలిపారు. వంద రోజుల ప్రణాళికలో భా గంగా ఐదో వార్డులోని గంగాసదన్ పార్కులో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాళీ స్థలాలు, పార్కుల్లో మొక్కలు నాటిస్తున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ మేనేజర్ దశరథం, అధికారులు జగన్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి

మర్పల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మర్పల్లి ప్రధాన రోడ్డు విస్తరణలో ఇళ్లు, దుకాణాలు కోల్పోతున్న వారిని ఆదుకోవాలని మాజీ జడ్పీటీసీ మధుకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మర్పల్లిలో 100 మీటర్ల రోడ్డు వెడల్పులో పేద, మధ్య తరగతికి చెందిన వారు దుకాణాలు, ఇళ్లు కోల్పోతున్నారని తెలిపారు. వారికి నష్టపరిహారంతోపాటు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ పురుషోత్తంకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మోహన్‌రెడ్డి, ఖాజా, రమేశ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రెచ్చిపోతున్న బైక్ దొంగలు

ఘట్‌కేసర్ రూరల్, జూల్4(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో బైక్ దొంగలు రెచ్చిపోతున్నారు. ఇంటి ముందు పార్క్ చేసిన బైక్‌లను టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడుతున్నారు. గురువారం అర్ధరాత్రి దాటాక ఘట్‌కేసర్ పట్టణం పటేల్ నగర్‌లో నలుగురు దుండగులు బైక్ దొంగతనాలకు యత్నించారు. మూడు బైక్‌ల పెట్రోల్ పైప్‌లను కట్ చేసి పెట్రోలు తీశారు. (టీఎస్ 06ఈవై 3830)బైక్ హ్యాండిల్ విరుగగొట్టి ఎత్తుకెళ్లారు. ఉదయం గమనించిన బైక్ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నలుగురు దొంగలు తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో వచ్చినట్లు సీసీ ఫుటేజీల్లో రికార్డయ్యాయి. రాత్రి వేళలో గస్తీ ముమ్మరం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మొరం ట్రాక్టర్ల పట్టివేత

యాలాల, జూలై 4, (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా మొరం తరలిస్నున్న ఆరు ట్రాక్టర్లను పట్టుకుని పోలీసులకు అప్పగించామని తహసీల్దార్ వెంకటస్వామి పేర్కొన్నారు. మండల పరిధిలోని పగిడ్యాల గ్రామంలో కొందరు అనుమతులు లేకుండా జేసీబీ ద్వారా తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్ల ద్వారా మొరం తరలిస్తున్నట్లు సమాచారం అందిందని, వెంటనే ఆర్ఐ చరణ్ అక్కడికి వెళ్లి మొరం తరలిస్తున్న ట్రాక్టర్ల యజమానితో మాట్లాడారు. ఎలాంటి అనుమతి లేదని నిర్ధారణకు వచ్చి ట్రాక్టర్లను పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ: ఇద్దరికి తీవ్ర గాయాలు

పరిగి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి పరిగి పరిధిలోని సయ్యద్‌పల్లి మల్కాపూర్ శివారులో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండలం బాసుపల్లి గ్రామానికి చెందిన అటికె నర్సింహులు(22), రాఘవేందర్(23) బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా సయ్యదమల్కాపూర్ శివారులో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. బైక్ లారీ చక్రం కింద పడి కొంతదూరం వెళ్లడంతో మంటలు చెలరేగాయి. బైక్‌పై ఉన్న నర్సింహులు, రాఘవేందర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని అంబులెన్స్‌లో పరిగి ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్సల తర్వాత మెరుగైన వైద్యం కోసం వికారాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. నర్సింహులు పరిస్థితి విషమంగా ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిషేధిత గుట్కా పట్టివేత

కోట్‌పల్లి, జులై 4(ఆంధ్రజ్యోతి): గుట్కా అమ్ముతున్న షాపు యజమానులపై కేసు నమోదైన ఘటన కోట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ శైలజ తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రెండు కిరాణాషాపుల్లో గుట్కాలు పాన్ మసాలాలు పట్టుపడ్డట్లు ఎస్ఐ తెలిపింది. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



నివాళులర్పిస్తున్న నాయకులు, ప్రజలు

యువతకు ఆదర్శం స్వామి వివేకానంద

ఘట్‌కేసర్ రూరల్, జూలై4(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జీవితం యువతకు ఆదర్శమని మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధలోని అవుశాపూర్‌లో శుక్రవారం స్వామి వివేనంద వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. మశ్చేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సాయిలు, వెంకటేష్, సదానంద్ రెడ్డి, బాలుయాదవ్ పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి

శామీర్‌పేట, జూలై 4(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కెనరా బ్యాంకు మేనేజర్ శ్రేయాదాస్ గుప్త పిలుపునిచ్చారు. కెనరా వ్యవస్థపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం శామీర్‌పేటలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శామీర్‌పేట బ్రాంచ్ మేనేజర్ శ్రేయాదాస్ గుప్త, పాఠశాల హెచ్ఎం వేణుతో కలసి మొక్కలు నాటారు.



మొక్కలు నాటుతున్న కెనరా బ్యాంక్ మేనేజర్ శ్రేయాదాస్ గుప్తా

పర్యావరణాన్ని పరిరక్షించాలి

తూంకుంట మున్సిపల్ పరిధిలోని ఉప్పరిపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వనమహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఎక్సలెన్షియా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నీరజ, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో అడ్మిన్ రామ్‌చందర్‌రావు, శామీర్‌పేట పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, ఎస్ఐ దశరథ, ఎంఈఓ కమలాకర్, మాజీ సర్పంచ్ రవీందర్, మున్సిపల్ మేనేజర్ శ్రాశణ్‌కుమార్ పాల్గొన్నారు.

అన్ని దానాల కన్న విద్యాదానం గొప్పది

వికారాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అన్ని దానాల కన్న విద్యాదానం గొప్పదని మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్ అన్నారు. శుక్రవారం మద్గుల్ చిట్టంపల్లి ఉన్నత పాఠశాలలో ఉద్యోగ విరమణ పొందుతున్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు యలాల్ నర్సింహులను ఘనంగా సన్మానించారు. అధికారులు, ఉపాధ్యాయులు, నాయకులు పాండు, వెంకటయ్య గౌడ్ గ్రామస్తులున్నారు.



పదవీ విరమణ పొందిన నర్సింహులును సన్మానిస్తున్న గోపాల్, గ్రామస్తులు

ఓటరు జాబితాలో తప్పులుండొద్దు

తాండూరు రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): బూత్ లెవల్ అధికారులు ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం తాండూరు జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ నంబర్-1 పాఠశాలలో బూత్‌లెవల్ అధికారులకు మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి 18 ఏళ్లు పైబడిన వారిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు తారాసింగ్, డిప్యూటీ తహసీల్దార్ లలిత, మాస్టర్ ట్రైనర్లు ముస్తాఫీర్, రాంనర్సింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, ఫక్రోజీ, విశ్వనాథం, రవి, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఉమాశంకర్ ప్రసాద్